# మళ్ళె పెండు
# ఇది
# శేషోత్సవం

నాలుక ఇంత పొడుగు బయటకు తీసి వెక్కి రించి పారిపోతున్న పార్వతిని తరిమి తరిమి జడగంటలు దొరకబుచ్చుకుని ఒక్క గుంజు గుంజి మొట్టికాయ వేసాడు రంగుమని – రాముడు

కీచుమంటూ అరిచి ఆరున్నొక్క రాగాన్ని అందుకున్న ఏడేళ్ల పార్వతిని బెల్లం ముక్క పెట్టి ఊరుకోబెట్టలేక సతమతమయింది వర్ధనమ్మ

'వదినా' ఇంత చిన్నప్పుడే క్షణం పడక కొట్టుకు చస్తున్న వీళ్లిద్దరికీ పెళ్లి చేద్దామంటున్నావు వీళ్ళు సవ్యంగా కాపరం చేస్తారంటావా?'

సీతమ్మ మాటలకు ఫెళ్ళున నవ్వింది వర్ధనమ్మ

'ఈ దెబ్బలాటనేం చూసావు? ఇంకో క్షణం ఆగు – వీళ్ల బండారం బయట పడుతుంది '

మెల్లిగా అత్తయ్య ఒడిలోంచి జారిపోయి పారిపోతున్న చిన్న పార్వతిని టక్కున పట్టుకుంది వర్ధనమ్మ

'ఏమే కోడలు పిల్లా' అంత బెల్లం ముక్క తింటే జబ్బు చేస్తుంది ఇలా తే'–

'మరి బావకు కూడ పెడతాగా' – కళ్ళు చక్రాల్లా తిప్పింది పార్వతి

'ఇపుడే కదే, వాడు కొట్టాడని పెంకు లెగిరి పోయేలా ఏడ్చావు '

'మరి జడ పట్టుకుని గుంజితే మెద నొప్పెట్టదేంటి?'

'అసలు రాముడు నిన్నెందు క్కొట్టాడే పారూ'–

అత్తయ్య ప్రశ్నకి పార్వతి కళ్లల్లో రోషం కదిలింది

మరి బొమ్మల పెళ్లిలో మగ పెళ్లివారికి పెట్టాల్సిన అటుకులు సెనగపప్పు దొంగతనంగా అంతా తినేసా డత్తయ్యా బావ? నాకెంత అవమానం – అసలే ఆడపిల్ల తల్లిని – అందుకే కంద ఊడొచ్చేలా గిల్లేసాను పాపం నొప్పెట్టిందేమో బావకి?

గుండ్రాయంత బెల్లం ముక్కని పరికిణీ చాటున దాచుకుని ముసిముసిగా నవ్వుకుంటూ పోతున్న కూతుర్ని చూసి ముక్కున వేలేసుకుంది సీతమ్మ

మూణ్నెల్ల తర్వాత ఏడేళ్ల పెళ్లికూతురు – తొమ్మిదేళ్ల పెళ్లికొడుకు – ఆ పెళ్లిని చూసి అంతా ముచ్చటపడిపోయారు పెళ్లి పీటల మీదే జుట్టూ జుట్టూ పట్టుకున్న జంటను చూసి ముసి ముసిగా నవ్వుకున్నారు

* * * *

సరిగ్గా ఎభైయ్యేళ్ల తర్వాత –

రామచంద్రయ్య గారి చావును పెళ్లి వేడుకలా జరిపించి బంధువులంతా వెళ్లిపోయారు అయితే నాన్నమ్మ పార్వతమ్మ బొట్టు చెరిపేసి గాజులు బద్దలు కొడుతున్నప్పుడు మాత్రం పెద్దకొడుకు కూతురు మైత్రి ఆవేశంగా అరిచింది

'ఇది చాల అన్యాయం – నాన్నమ్మకి ఈ బొట్టూ పూలూ గాజులు తాతయ్య పెళ్లి చేసుకున్నప్పుడు వచ్చినవి కావు తాతయ్య పోగానే వాటిని తీసేసే అదికారం ఎవరికీ లేదు అనాదినుంచే స్త్రీకి ఈ కుళ్ళు సంఘం ఇలాగే అన్యాయం చేస్తోంది ఇదే అమెరికాలో అయితేనా ' మైత్రి బాదకు అర్థం లేకపోలేదు

పార్వతమ్మ పచ్చని ముఖం మీద కాసంత, కుంకుమ బొట్టు – మండే సూర్యుడిలా – కాళ్లకి మురుగులు – చెవులకు ఎర్రరాళ్ల దుద్దులు, కళ్లనిండా కాటుకతో ఎప్పుడూ కళకళ్లాడే నాన్నమ్మ మొహం బోసిగా కళా విహీనంగా చూడలేక కన్నీరు వరదలా పొంగి పోతోంది మైత్రికి

మైత్రి మాటలకు మూగ లేగదూడలా కళ్లెత్తి చూసింది తప్ప పన్నెత్తి పలుకలేదు పార్వతమ్మ ఐదుగురు కూతుళ్ళు ఆరుగురు కొడుకులూ తల్లిని తమతో తీసుకుపోవాలని ఎంతగా గొంతులు పగిలేలా వాదించుకున్నా పెదవి విప్పింది కాదు పార్వతమ్మ

'కూలిపోతున్న ఈ పాత కొంపలో పడి ఉండాల్సిన ఖర్మ నీకేం పట్టిందమ్మా? ఎవరి దగ్గరుంటే నీ బ్రతుకు వెళ్లిపోదు నా మాట విను–' పెద్దకూతురు అమెరికాతీసుకు పోవాలని ఆలోచన–

'తండ్రి పోగానే తల్లిని దిక్కులేని దాన్ని చేసారనే నింద మా మొహాన రాసి పెట్టి వుంది కాబోలు' – ఆఖరి కొడుకు నిష్ఠూరమాడాడు

'అమ్మా నీ ఆస్తి మాకేం అక్కర్లే దమ్మా? కన్నతల్లిని కష్టంలో ఆదుకున్నా మన్న తృప్తి మిగలనీ – మాతో వచ్చెయ్' – మరో కొడుకు

'పోనీ పార్వతమ్మా పోయిన మారాజెలాగూ పోయాడు లంకంత కొంపలో ఒక్కతెవూ ఏం ఉండ గలవు? ఆ ఎకరా చెక్కా తెగనమ్మి నీ కిష్టమైన కొడుకు దగ్గరో కూతురు దగ్గరో ఉండచ్చుగా–' గ్రామ పెద్ద నోరు విప్పాడు

'నీకేం అదృష్టవంతురాలివి కొడుకుల చదువులు ఉద్యోగాలూ, కూతుళ్ల పెళ్లిళ్ళు అన్ని బాధ్యతలూ ఆముసలాయన ఉండగానే తీర్చేసాడు చీకూ చింతా లేకుండా రామా కృష్ణా అనుకుంటూ కూర్చోవడమే'

ఊరి పెద్దల మాటలుగాని కొడుకుల ఆదరింపులు గాని కూతుళ్ల నిష్ఠూరాలు గాని పార్వతమ్మ చెవిని సోకడం లేదు ఆమె కళ్ళు దేన్నో వెతుకుతున్నాయి చెవులు ఏదో వినాలని తాపత్రయ పడుతున్నాయి గుండె ఏ పిలుపు కోసమో వెర్రెత్తి ఆవేదన పడుతోంది

ఆ కొంపలోంచి ఆమెను కదప లేక పోయిన బంధువులంతా విసుక్కుంటూ వెళ్ళి పోయారు మైత్రి మాత్రం నానమ్మను అలా వదిలేసి అమెరికా వెళ్లలేక పోయింది చిన్నప్పట్నుంచే భారతదేశ వాతావరణం ముఖ్యంగా పల్లెలంటే ప్రాణం పెట్టే మైత్రి చిన్నప్పుడు ఆరేసి నెలలు నానమ్మ తాతయ్యల దగ్గరే ఉండి పోయేది చల్ల చిలుకుతూ పార్వతమ్మ పాడే తత్వాల కోసం చెవి కోసుకునేది మైత్రి ఎంత చలిలోనయినా నానమ్మ గొంతువిని మంచం మీద చటుక్కున లేచి కూర్చునేది కూతురి అబిరుచి తెలిసినా మైత్రిని వదిలి ఉండలేని పార్వతమ్మ పెద్ద కొడుకూ కోడలూ అమెరికాలోని సంబంధమే చేసారు ఆమెకు దాంతో ఈ మధ్య కాలంలో ఇండియా రాలేక పోయింది నానమ్మ తేరుకుంటే తప్ప అప్పుడే అమెరికా రాను .అన్న కూతుర్ని నొప్పించ లేక, అల్లుడికి ఏం సర్ది చెప్పాలో నని భయపడుతూ వెళ్లిపోయారు పెద్ద కొడుకు కోడలు–

* * * * *

పార్వతమ్మ కళ్ళు అర్ధ నిమీలితాలయ్యాయి

తీరైన రంగవల్లులు – ఫొటో ఏలేశ్వరపు నరసింహారావు

